శ్రీరామనవమి శుభాకాంక్షలు

సిద్దిపేట, ఏప్రిల్ 16: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకుసాగాలన్నారు. శ్రీరాముడి ఆశీస్సులతో అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలని, ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో రైతులు వర్ధిల్లాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు. సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా జరుపుకోవాలని కోరారు.

ఎన్నికల సభను విజయవంతం చేయాలి

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలకిషన్

బెజ్జంకి, ఏప్రిల్ 16: మండల కేంద్రంలో ఈనెల 18న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించే ఎన్నికల సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంతో పాటు, గూడెంలో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, రాజయ్య, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్‌ను బొందపెడతాం

మాట్లాడుతున్న లింగంపల్లి శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బందపెడతామని ఎమ్మార్పీఎస్ మెదక్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు కృష్ణ, పరశురాములు, రాములు, రాజు, ప్రకాశ్, మల్లేశం, రమేశ్, శ్రీను, పవన్ కల్యాణ్, లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

వైద్యసేవలందించాలి

రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

దుబ్బాక, ఏప్రిల్ 16: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్యకేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు గజ్వేల్, వినోద్ బాబ్జి, వైద్యాధికారులు ముదసిర్, హిమబిందు, సూపర్‌వైజర్లు రాజేందర్, దయానంద్, చైతన్య పాల్గొన్నారు.

సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

పరికరాలు పంపిణీ చేస్తున్న ఝాన్సీలక్ష్మీబాయి

చేర్యాల, ఏప్రిల్ 16 : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమశాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.ఝాన్సీలక్ష్మీబాయి కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన గ్రోత్ మానిటరింగ్ పరికరాలను జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, చేర్యాల ప్రాజెక్టు సీడీపీవో శారదతో కలిసి ఆమె అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం పట్టణంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కనకరాజు, కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, శోభ పాల్గొన్నారు.

విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలి

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి

హుస్నాబాద్, ఏప్రిల్ 16: విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి భిక్షపతి అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నత విద్యను పూర్తిచేసి మంచి స్థానంలో స్థిరపడి తల్లిదండ్రుల ఆశయాలు నిలబెట్టాలని సూచించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గణితం పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జేవీ రాజిరెడ్డి, డాక్టర్ ఏలూరి కోమల, బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ బి.రేణుక, డాక్టర్ బి.పద్మ, రాజ్యలక్ష్మి, జ్యోత్స్న, సుమలత, నవీన్, శ్రీనివాస్, చుక్క రమేశ్, సదానందం, వీడ్కోలు సమావేశ నిర్వహణ కమిటీ సభ్యులు వివేకానంద, వంశీ, వెంకటేశ్, అస్మిత, కృష్ణవేణి, సౌజన్య పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే గజ్వేల్ అభివృద్ధి

విలేకరులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య

గజ్వేల్, ఏప్రిల్ 16: కేసీఆర్ హయాంలోనే గజ్వేల్ అభివృద్ధి జరిగిందని మున్సిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య అన్నారు. గజ్వేల్‌లో ఆర్యవైశ్యులకు పెద్దపీట వేసిన బీఆర్ఎస్‌తోనే తామంతా ఉంటామని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గజ్వేల్ అభివృద్ధిలో 50 ఏండ్లు ముందుకు వెళ్లిందన్నారు. మంగళవారం స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులను నిర్మించి మండుటెండల్లో తాగు, సాగునీళ్లు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ చూపించిన ప్రత్యేక చొరవతోనే రూ.150 కోట్లతో యూజీడీ, రింగ్‌రోడ్డు, అన్ని వార్డుల్లో సీసీరోడ్లు, పేద విద్యార్థులు చదువుకోవడానికి ఎడ్యుకేషన్ హబ్,ప్రభుత్వ దవాఖానలు, విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసం కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వదంతులను నమ్మవద్దని బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు విజయలక్ష్మీసత్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణ, గోవర్ధన్, రాజు, నాగేందర్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు ప్రమాదకరం

హుస్నాబాద్, ఏప్రిల్ 16: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగానికి పెను ప్రమాదకరంగా మారుతున్నాయని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి ఉన్నదని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం హుస్నాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మల్లె చెట్టు చౌరస్తా నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంబిస్తూ రాష్ట్రాలపై పెత్తనం చెలాయించే కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో జేఏసీ, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు వీరన్నయాదవ్, గడిపె మల్లేశ్, వెన్న రాజు, వల్లపు రాజు, భూక్యా సరోజన, నాంపల్లి సమ్మయ్య, తిరుపతినాయక్, కైలునాయక్, బత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ముస్తాబు

- నేడు శ్రీరామ నవమి

హుస్నాబాద్‌లో శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబైన రామాలయం

హుస్నాబాద్, ఏప్రిల్ 16: శ్రీరామనవమి వేడుకలకు హుస్నాబాద్ పట్టణంతో పాటు డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఆలయాలు ముస్తాబయ్యాయి. హుస్నాబాద్ పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అనంతరం 10గంటలకు కల్యాణం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు పట్టువస్త్రాల సమర్పణ

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 16: శ్రీరామనవమిని పురస్కరించుకుని హుస్నాబాద్‌లోని శ్రీసీతారాచంద్రస్వామికి బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న తెలిపారు. స్థానిక రామవరం రోడ్డులోని శ్రీసీతారామా ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

రాయపోల్, ఏప్రిల్ 16: దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో సీతారామచంద్రస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఐదు రోజులు జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేడు సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు దేవాలయం వద్ద ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 16 : సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి సిద్దిపేటలోని రామాలయం ముస్తాబైంది. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేసి మామిడి తోరణాలు, అరటిఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

శ్రీనివాస్‌రెడ్డికి పరామర్శ

పాశం శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న లచ్చగౌని రాములుగౌడ్

వర్గల్, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్, గౌరారం గ్రామానికి చెందిన పాశం శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యానికి గురై కొంపల్లిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఆయన్ను గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకుడు లచ్చగౌని రాములుగౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

మీడియాతో మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి

వర్గల్, ఏప్రిల్ 16: వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొట్టాల యాదగిరి ఆరోపించారు. మంగళవారం వర్గల్‌లో బీఆర్ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు పడిగెరాజు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు మరోసారి ఓట్లకోసం గారడీలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నేతల బెదిరింపులకు ఎవరూ బయపడరని, రఘునందన్‌రావు ఓటమి ఖాయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు లింగస్వామి, నరేశ్, రమేశ్, శేఖర్, నర్సింహులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

నర్సాయపల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఆడిట్ బృందం సభ్యులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్16: మద్దూరు మండలం నర్సాయపల్లిలో (2018-2022) ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన వివిధ పనులను మంగళవారం అకౌంట్ జనరల్ ఆడిట్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి తోటలు, ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు, సీసీ రోడ్లు, నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులతో పాటు ఎంపిక చేసిన 16 రకాల పనులు, ఉపాధిహామీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, సీనియర్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, అడిషనల్ ఆడిట్ ఆఫీసర్స్ కల్యాణ్, శేషగిరి, కొండయ్య, ఏపీడీ శివాజీ, డివిజన్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రభాకర్, పీఆర్ ఏఈ వినయ్, ఈసీ పరశురాములు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గ్రామస్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ సుధీర్‌రాజ్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్16: ఎండల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధీర్‌రాజ్ సూచించారు. మంగళవారం మద్దూరు మండలంలోని రేబర్తిలో ఉపాధి కూలీలు, గ్రామస్తులకు ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ ప్రతిభ, ఏఎన్ఎం మల్లోత్రి, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, ఫీల్డ్‌అసిస్టెంట్ ఐలయ్య, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నారాయణరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉత్తరాలు రాస్తున్న రైతులు

హామీలు నెరవేర్చాలి

నారాయణరావుపేట, ఏప్రిల్ 16: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నారాయణరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతు రుణమాఫీ రూ.2లక్షలు చేయాలని, పెంచిన రైతుబంధు రూ.15 వేలు రైతుల ఖాతాల్లో జమచేయాలని, లేకుంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతామని రైతులు హెచ్చరించారు. రైతులకు బీఆర్ఎస్ మండల నాయకులు మద్దతు ప్రకటించారు.

23న వీరహనుమాన్ శోభాయాత్ర

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 16: పట్టణంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న వీర హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పట్టణంలో నాయకులు ఆవిష్కరించారు.కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తడక లక్ష్మణ్, మండల కార్యదర్శి సంపత్‌కుమార్, నాగరాజు, పెద్ది తిరుపతిరెడ్డి, నీల శివకుమార్, శేరి బాలనారాయణ, చిట్టా నాగరాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, చిగుళ్ల శ్రీనివాస్, రవీందర్, కందుకూరి సిద్ధిలింగం, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 16: మండలంలోని దౌలాపూర్‌లో ఈనెల 18 నుంచి జరుగనున్న బొడ్రాయి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణ ఆహ్వాన పత్రిక అందజేశారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గోడపత్రిక ఆవిష్కరణ

గజ్వేల్, ఏప్రిల్ 16: భద్రాచలం సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికతో పాటు కరపత్రాలను మంగళవారం పట్టణంలోని కృష్ణాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామరాజు, రామచంద్రం, మోత్రాములు, రాజు, వెంకటేశ్, లక్ష్మయ్య, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి మాధవి

బెజ్జంకి, ఏప్రిల్ 16: మండలంలోని దాచారం, లక్ష్మీపూర్, బేగంపేట, వడ్లూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆయన సతీమణి మాధవి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా ఆయన గతంలో చేసిన అభివృద్ధి పనులు, పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన పనులపై ఆమె ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్ని గ్యారెంటీలను నెరవేరుస్తామని చెప్పి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఆమె వెంట ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, నాయకులు తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, స్వామి, శేఖర్ బాబు, రాజు, బాలనర్సు, కిష్టయ్య, అంజిరెడ్డి ఉన్నారు.

బకాయి చెల్లిస్తేనే బస్సు ఎక్కనిస్తాం

- విక్రాస్ గ్రామర్ స్కూల్ యాజమాన్యం నిర్వాకం

చేర్యాల, ఏప్రిల్ 16: మండలంలోని ఆకునూరుకు చెందిన ఆటోడ్రైవర్ తోట శ్రీనివాస్ కుమారుడు సురేశ్ పట్టణంలోని విక్రాస్ గ్రామర్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు చెల్లించాల్సిన రూ.30వేల ఫీజులో సురేశ్ తండ్రి రూ.25 వేలు చెల్లించాడు. మరో రూ.5వేలు బకాయి ఉంది. మంగళవారం గ్రామం నుంచి రోజువారీగా విద్యార్థులను తీసుకువచ్చే స్కూల్ బస్సు డ్రైవర్ సదరు విద్యార్థి బస్సు ఎక్కిన అనంతరం ఫీజు కట్టలేదని రోడ్డుపై దించి వెళ్లిపోయాడు. ఆందోళనకు గురైన తండ్రి శ్రీనివాస్ పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేసి ఫీజు చెల్లిస్తానని చెప్పినప్పటికీ తమ కుమారుడిని ఎందుకు రోడ్డుపై దించి అవమానించారని ప్రశ్నించారు. అనంతరం తమ కుమారుడికి జరిగిన అవమానం, పరీక్షకు హాజరుకాని విషయమై విలేకరులను ఆశ్రయించాడు. విషయం విలేకరులకు తెలిసిందనే విషయాన్ని గుర్తించిన స్కూల్ యాజమాన్యం తండ్రి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి కుమారుడిని పాఠశాలకు తీసుకురావాలని కోరింది. ఈ విషయమై విక్రాస్ గ్రామర్ స్కూల్ ప్రతినిధి రాజేశం 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడుతూ స్కూల్ ఫీజు బకాయి ఉన్నాడని, తండ్రితో మాట్లాడి విద్యార్థికి తిరిగి పరీక్ష రాయిస్తామన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం

శ్రీచైతన్య పాఠశాలలో ధ్వంసమైన కిటికీ అద్దాలు, ఫర్నిచర్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16: ప్రభుత్వ విద్యా విధానానికి శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం తూట్లు పొడుస్తున్నదని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో రెండోబ్రాంచ్ శ్రీచైతన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు అడ్వాన్స్ పరీక్షల పేరుతో టెన్త్‌కు సంబంధించిన సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో కొంతమంది ఏబీవీపీ నాయకులు మంగళవారం పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. అయితే తమ ఇష్టం వచ్చినట్లు చేస్తామని ప్రిన్సిపాల్ బదులివ్వడంతో ఆగ్రహంతో ఏబీవీపీ నాయకులు పాఠశాలలో ఫర్నిచర్, తరగతి గదుల కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు

గజ్వేల్‌లో రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గజ్వేల్, ఏప్రిల్ 16: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో 30మందికిపైగా విద్యార్థులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, లెక్చరర్ నవీన్‌కుమార్ రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని దానాలకంటే రక్తదానం గొప్పదన్నారు. రక్తదానానికి సంబంధించిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందజేశారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 16: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు శ్రీనివాస్, మహేందర్, శ్రద్ధానందం, పల్లవి, కృష్ణయ్య, మెడికల్ కళాశాల వైద్యులు స్వాతి, ఉషశ్రీ, వనీత,ఇమ్రాన్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నిరసన తెలుపుతున్న బైరాన్‌పల్లి గ్రామస్తులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్16: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఎదుట మంగళవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహులు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

నేటినుంచి పెద్దమ్మ పండుగ

కొమురవెల్లి, ఏప్రిల్ 16: మండలంలోని గురువన్నపేటలో నేటి నుంచి ఈనెల 19వ తేదీ వరకు ముదిరాజుల కులదైవం పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవ వేడుకలు బోనం కృష్ణస్వామి, మదిరాజు కులస్తుల ఆధ్వర్యంలో కన్నుల పండుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు బుధవారం పోచమ్మ, మైసమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మలకు బోనాలు, 18న గంగతెప్ప, పుట్ట కమ్మాట, ఆలయం ఆవరణలో అన్నదానం, కథ చెప్పుట, 19న ఉదయం పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం, సాయంత్రం అగ్నిగుండాలు, ఓడిబియ్యంతో పెద్దమ్మతల్లి కల్యాణ మహోత్సవ వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిపై కేసు

మిరుదొడ్డి, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని అడ్డుకుని చెప్పుల దండ వేసిన వ్యక్తుల పై కేసు నమోదు చేసిన సంఘటన మిరుదొడ్డి మండలం కాస్లాబాద్‌లో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ప్రచార రథం కాస్లాబాద్‌కు వచ్చింది. అదే గ్రామానికి చెందిన రంగనాయకమ్మ తో పాటు ఆతడి భార్య లక్ష్మి, తల్లి లక్ష్మి ప్రచార రథానికి ఉన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి